క్లుప్తంగా

చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం



వీధులను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ తెల్లవారుజామున పర్యటించారు. దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో వీధులను శుభ్రం చేయించారు. ఏ ప్రాంతంలోనైనా అపరిశుభ్రంగా ఉంటే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందిస్తే శుభ్రం చేయిస్తామన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పాములపాడు: సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనలు అందరికీ వర్తిస్తాయని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. బుధవారం స్థానిక ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లోని ప్రజలతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడైనాసరే బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. రాజకీయ పరమైన విషయాల గురించి గోడలపై రాయరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు బుధవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల పట్ల ఇతరులు ఏలా ప్రవర్తిస్తున్నారో గమనించే విధంగా అవగాహన కల్పించారు. ఇతరుల పట్ల బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: అటవీశాఖ నంద్యాల జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ రామకొండారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మహానందికి వచ్చారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు, అర్చకులు వారికి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. ఆయన వెంట డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆరోగ్య కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

మహానంది: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేదలకు స్నేహపూర్వక వాతావరణంలో వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంతో పాటు బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణలో భాగంగా తల్లీ, బిడ్డల ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మహానందిలో టెండర్లు వాయిదా

మహానంది: మహానంది దేవస్థానంలో వివిధ విభాగాలకు నిర్వహించిన టెండర్లను వాయిదా వేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో బుధవారం కొబ్బరిచిప్పల సేకరణ, నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, పూలదుకాణం, అభిషేక సామగ్రి, వాహనాల పూజ, తదితర విభాగాలకు వేలాలు నిర్వహించారు. టెండర్లలో కొబ్బరిచిప్పల సేకరణ, నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, పూలదుకాణం నిర్వహణకు టెండరుదారులు సీల్డుటెండర్లు దాఖలు చేశారు. కొబ్బరిచిప్పల సేకరణకు ప్రస్తుతం రూ. 22 లక్షలు ఉండగా కేవలం రూ. 14లక్షలు, నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం టెండరు సుమారు రూ. 60లక్షలు ఉండగా కేవలం రూ. 40లక్షలకు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో అధికారులు అన్నింటినీ వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పోటీకి ఎవరూ రాకుండా రెండు , మూడు పర్యాయాలు ఇలాగే చేస్తే తక్కువ ధరలకు తీసుకోవచ్చని టెండరుదారులు పక్కాగా ప్రణాళికలు రూపొందించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

పేదల సొంతింటి సంతోషం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు గౌరవం
- మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో 2,630 మందికి ఇళ్ల స్థలాలు
- గృహ నిర్మాణానికి ప్రభుత్వ సహకారం
- రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు సర్వహక్కులు



గాజులపల్లెలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లు



ఇదికదా.. అభివృద్ధి

మహానంది: గత ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టా రావాలంటే ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు సిఫారసు చేయాల్సి వచ్చేది. అర్హతలన్నీ ఉన్నా సెంటున్నర స్థలం కోసం ఎన్ని సార్లు అర్జీలు సమర్పించినా ఫలితం ఉండే దాకాదు. జన్మభూమి, ఇతర సమావేశాల్లో అర్జీ పెట్టుకుంటే గ్రామంలో మహా అయితే ఏ పదో, ఇరవై మందికో వచ్చేవి. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా అర్హత ఉంటే చాలు స్థలం మంజూరు అవుతోంది. ఎవరిచుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయ, వలంటీర్ ద్వారా ఇంటివద్దనే దరఖాస్తు చేసుకుంటే చాలు పథకాలు అందుతున్నాయి. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వహక్కులు

గతంలో పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇస్తే వాటిని అమ్ముకునేందుకు, రుణాలు తీసుకునేందుకు ఎలాంటి హక్కులు ఉండేవి కాదు. కానీ నేడు అందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందు చూపుతో లబ్ధిదారుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తుండటంతో స్థలాలపై సర్వహక్కులు దక్కేలా చేస్తోంది. మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో 1,057 మందికి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. బండిఆత్మకూరు మండలంలో 1573 మంది పేదలకు ఇంటి పట్టాలను అందించారు. అలాగే గృహ నిర్మాణాలకు సహకారం అందిచడంతో ఇప్పటికే చాలా గ్రామాల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అందుకోసం సుమారు రూ. 42 కోట్లు బిల్లుల రూపంలో లబ్ధిదారులకు చెల్లింపులు జరిగాయి. ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చారిత్రాత్మకంగా ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సైతం పూర్తయింది.

సొంతింటి కల నెరవేరింది



మాది నిరుపేద కుటుంబం, మేము కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు సొంత ఇల్లు లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థలం, ఇల్లు మంజూరు చేసింది. జగనన్న కాలనీలో మాకు స్థలం కేటాయించారు. మేము ఇల్లు కూడా నిర్మించుకున్నాం. మా సొంత ఇంటి కల నెరవేరింది. దరఖాస్తులు అందించిన వెంటనే ఎలాంటి సిఫారసు లేకుండా అర్హత ఆధారంగా స్థలం, ఇల్లు మంజూరు చేశారు.

– పసుపుల లక్ష్మీదేవి, గాజులపల్లె

ఎంతో ఆనందంగా ఉంది



మాది గాజులపల్లె గ్రామం. గతంలో ఇళ్ల స్థలాల కోసం పలు మార్లు దరఖాస్తులు చేసుకున్నాం. అయినా రాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్నాం. వలంటీర్లు, అధికారులు విచారణ చేసి అర్హురాలిగా గుర్తించి ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం సైతం జరుగుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ వలన మాకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– షేక్ తస్లీం, గాజులపల్లె

దరఖాస్తు చేసిన వెంటనే గుర్తించారు



మాకు సొంత ఇంటి స్థలం లేదు. వలంటీర్ ద్వారా ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అధికారులు విచారణ జరిపి స్థలం మంజూరు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మాకు సంక్షేమ పథకాలు అందాయి.

–కోలా ఈశ్వరమ్మ, గోపవరం

వైఎస్సార్‌సీపీ వెంటే ప్రజలు



వృద్ధులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ తెలిపారు. బుధవారం మేం సిద్ధం – మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా శ్రీశైలంలోని పలు కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సవమ్మ, కొటమ్మ, రవి, కార్యకర్తలు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఏఎస్‌డబ్ల్యూఓ వైవీ సుబ్బారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈనెల 25న నందికొట్కూరు మండలానికి చెందిన కొందరు పాత్రికేయులు హాస్టల్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి ఓ అమ్మాయి గర్భం దాల్చిందని, ఆ అమ్మాయిని చూపించాలని డిమాండ్ చేశారు. లేదంటే హాస్టల్‌కు వ్యతిరేకంగా వార్తలు రాస్తామని వార్డెన్ ఉమాదేవిని బెదిరించారు. ఆమె ఫిర్యాదు మేరకు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టడానికి వచ్చినట్లు ఏఎస్‌డబ్ల్యూఓ తెలిపారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థినులు, వార్డెన్ ఉమాదేవి, కుక్కర్, సిబ్బందిని విచారించారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



ఉప్పలదడియ దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

మిడుతూరు: సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు. బుధవారం మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో ఉరుసు మహోత్సవంలో భాగంగా దర్గాలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్‌తో కలిసి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి స్వగృహంలో విలేకరులతో శాప్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సుస్థిర అభివృద్ధి చెందేలా సీఎం జగన్ అన్ని మౌలిక వసతులు కల్పించారన్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు.

తప్పుడు ఆరోపణలను పట్టించుకోవద్దండి

ప్రతి పక్షాలు చేసే తప్పుడు ఆరోపణలను నమ్మొద్దని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నాగతులసి రెడ్డి, తువ్వా శివరామకృష్ణారెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, వంగూరు జనార్దన్‌రెడ్డి, మల్లు శివనాగిరెడ్డి, మల్లు వెంకటేశ్వర రెడ్డి, రామసుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మన్సూర్, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛతో వ్యక్తి మృతి

కొత్తపల్లి: మూర్ఛ రావడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పల్నాటి నారాయణ కుమారుడు పల్నాటి సుబ్రమణ్యం(31) గ్రామంలో ఇంటివద్దనే మరజిన్ను పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం మరజిన్నులో జొన్నలు ఆడిస్తుండగా మూర్ఛ రావడంతో కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటీన క్షతగాత్రుడిని ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు చెప్పారు. మృతుడికి భార్య సుప్రియ, మూడున్నర ఏళ్ల కొడుకు ఉన్నారు. చిన్నవయసులోనే సుబ్రహ్మణ్యం చనిపోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈ-హాస్పిటల్ రిపోర్టులతో కచ్చితమైన చికిత్స

నంద్యాల టౌన్: సర్వజన ఆసుపత్రిలో బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయాలజీ ల్యాబ్‌లలో నిర్వహించిన పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ-హాస్పిటల్ రిపోర్ట్‌ను రోగులకు అందజేస్తామని, ఈ-రిపోర్ట్‌తో రోగికి కచ్చితమైన చికిత్స అందించవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల ఫలితాల ఆన్‌లైన్ ప్రింట్‌ను రోగులకు అందజేయాలని డీఎంఈ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలోని ల్యాబ్‌లలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను రోగి ఓపీ నంబర్‌తో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. దీని వల్ల రోగికి ఎప్పుడు ఏ పరీక్షలు నిర్వహించారో తెలుస్తుందని, ఒకవేళ ఈ రిపోర్ట్ పేపర్ పోయినా ఓపీ నంబరు ద్వారా గతంలో చేసిన పరీక్షల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టాలి

- ఈర్నపాడులో వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించి పేదల అభ్యున్నతికి పాటుపడిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని ఏపీ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో టీడీపీకి చెందిన వంద కుటుంబాల వారు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు తిమ్మయ్య, బాలు, జయపాలు, ఓబులేసు, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరినవారిలో ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి మేలు చేకూర్చిన జగన్ మరోసారి సీఎం అయితేనే పేదలు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. మూడు ముక్కలాటల వచ్చిన మూడుపార్టీల కూటమిని నమ్మితే పేదలకు ఒరిగేది ఏమీ ఉండదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఓంకారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అన్నెం విశ్వనాథరెడ్డి, గ్రామ నాయకులు పెద్దరామసుబ్బారెడ్డి, ఎర్రం గోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అన్నెం గోపాల్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, గాజుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాలలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభకు శ్రీశైలం నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సీఎం బహిరంగ సభ కోసం బుధవారం నుంచే పార్టీ అభిమానులు సమాయత్తమయ్యారు. శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, రజాక్, అంబాలప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వేళ్లేందుకు స్వచ్ఛందంగా వాహనాలు సిద్ధం చేసుకున్నారు.

జూపాడుబంగ్లా: నంద్యాలలో నిర్వహించనున్న సిద్ధం సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 2వేల మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లనున్నారు. ఒక్కో గ్రామానికి రెండు బస్సుల చొప్పున మొత్తం 30బస్సులను ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. బస్సులతో పాటు కార్లు, ద్విచక్రవాహనాల్లో కలిపి మొత్తం 2వేల మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు.

సిద్ధం సభకు వేలాదిగా తరలి రావాలి



మాట్లాడుతున్న రవియాదవ్

నందికొట్కూరు రూరల్ : నంద్యాలలో పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నిర్వహించే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రవియాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వారు మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నేతృత్వంలో మేమంతా సిద్ధం సభకు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు అన్ని గ్రామాలకు చెందిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

పగిడ్యాల: నంద్యాలలో గురువారం జరిగే మేమంతా సిద్ధం సభకు మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అభిమానులు వేలాదిగా తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను, నాయకులను, ప్రజాప్రతినిధులను సమాయత్తం చేశారు. దిక్కులు పిక్కటిల్లేలా, నంద్యాల సిద్ధం సభ జనసంద్రంగా మారేలే రాయలసీమ వాసుల ఉనికిని చాటాలన్నారు. సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఎంపీటీసీలు పగడం గోపాల్, మిద్దె స్వాములు, బోరెల్లి శ్యామలమ్మ, చంద్రమోహన్‌నాయుడు, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్ వద్ద విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

నందికొట్కూరు: రాత్రి పగలు కష్టపడి చదివిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం నాటికి పదో తరగతి పరీక్షలు ముగిశాయి. దీంతో విద్యార్థుల తలపై కొండంత భారం తొలిగినట్లు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చి కేరింతలు కొట్టారు. ఒకరికొకరు అలింగనం చేసుకొని వీడ్కోలు చెప్పుకున్నారు. పట్టణంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం ఏడు పరీక్ష కేంద్రాలతో పాటు బ్రాహ్మణకొట్కూరులో మరో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో 1,129 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం సాంఘిక శాస్త్రం పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు మొదలైన నాటి నుంచి పూర్తి అయ్యేవరకు పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వాములు విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించారు. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు కొత్తపల్లి పరీక్ష కేంద్రంలో 173 మందికి 147 మంది, గోకవరం పరీక్ష కేంద్రంలో 100 మందికి 81 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. కొత్తపల్లి పరీక్ష కేంద్రాన్ని నంద్యాల జిల్లా డిప్యూటీ ఈఓ ఎం.మహబూబ్ బేగ్, గోకవరం పరీక్ష కేంద్రాన్ని కొత్తపల్లి ఎంఈఓ–2 ఇనాయతుల్లా తనిఖీ చేశారు.

ఇద్దరు గైర్హాజరు

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిడ్యాల జెడ్పీ పాఠశాల, లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 457 మంది రెగ్యూలర్ విద్యార్థులు కాగా, 168 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే రెగ్యూలర్ విద్యార్థుల్లో ఇద్దరు మాత్రమే గైర్హాజరయ్యారని ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ఎగ్జామ్ చీఫ్‌లు ఎల్లనాయుడు, సలీంబాషా, మధుసూదన్‌రావు, సిట్టింగ్ స్క్వాడ్ రవీంద్రానాథ్ గౌడ్, శ్రీనివాసరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారులు సత్యనారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, రషీద్ మియ్యా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు.

హాస్టళ్లు ఖాళీ

జూపాడుబంగ్లా: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ముగియటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఇళ్లకు వెళ్లారు. మండలకేంద్రంలోని కస్తూర్బా, గురుకులం, మోడల్‌స్కూల్ హాస్టళ్లు ఖాళీ అయ్యాయి. మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో ఈ ఏడాది ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్, గురుకుల పాఠశాలల్లో మూడు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయగా 417 మంది రెగ్యులర్ విద్యార్థులు, 176 మంది కంపార్టుమెంటల్ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలను రాశారు. బుధవారం నిర్వహించిన చివరి పరీక్ష సోషల్ స్టడీస్ పరీక్షకు మోడల్ స్కూల్లో 187 మందికి గాను 20మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 135కు గాను 18 మంది గైర్హాజరుకాగా గురుకుల పాఠశాలలో 134 మందికి ఆరుగురు గైర్హాజరైనట్లు పరీక్షాకేంద్రాల చీఫ్‌లు శ్రీరామచంద్రమూర్తి, పుల్లారెడ్డి వెల్లడించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, పరీక్షా కేంద్రాలను బుధవారం ఎంఈఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్ రామసుబ్బయ్య తనిఖీ చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారులు మల్లికార్జున నాయకర్, రవి ప్రకాష్ రావు తెలిపారు. అదేవిధంగా కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్ సుభాన్ తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 175 మంది విద్యార్థులకు 152 మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 209 మందికి 41 మంది, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 173 మందికి 153 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ముగిసిన పది పరీక్షలు

మహానంది: పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెగ్యులర్ విద్యార్థులకు పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల నుంచి ఉత్సాహంగా వెళ్లారు. బండిఆత్మకూరు మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు, మహానంది మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఒకేషనల్ విద్యార్థులకు మాత్రమే మరో పరీక్ష ఉన్నట్లు విద్యాధికారులు తెలిపారు.

32 మంది విద్యార్థులు గైర్హాజరు

పాములపాడు: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి పరీక్ష సోషల్ సబ్జెక్టుకు 32 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్లు రమణ, వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షా కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో హమ్మయ్యా పరీక్షలు ముగిశాయని ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులకు తమ మిత్రులకు బాయ్ అని చెప్పుకుంటూ ఫలితాలు వెలువడిన తరువాత మళ్లీ కలుద్దామని చెప్పుకుంటూ పరీక్షా కేంద్రం నుంచి వెళ్లి పోయారు. తల్లిదండ్రులు హాస్టళ్ల నుంచి తమ పిల్లలను సొంత గ్రామాలకు పిలుచుకుపోయారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 430 మంది విద్యార్థులకు గాను 399 మంది హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ పునఃప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ప్రతిష్ఠించనున్న నూతన విగ్రహాలు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంబమల్లేశ్వరస్వామి ఆలయ, విగ్రహాల పునఃప్రతిష్ట వేడుకలు బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన గుండ్రెడ్డి రాఘవరెడ్డి దేవదాయ, ధర్మదాయశాఖకు రూ.14లక్షల నిధులు చెల్లించడంతో వారు ఆలయ నిర్మాణానికి రూ.65లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పాటు దాతలు, గ్రామస్తుల సహకారంతో రూ.కోటి వెచ్చించి నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట వేడుకలను చేపట్టారు. అర్చకులు వేదమంత్రాలను విగ్రహాలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం , నవగ్రహ జపములు, ప్రదాన దేవతా మూలమంత్ర జపములు, చండీ హోమం వంటి పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. నూతన ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి నూతన విగ్రహాలను దర్శించుకున్నారు.

వంద శాతం పనిదినాలు పూర్తిచేయాలి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ తప్పనిసరిగా అర్హులైన కుటుంబాలకు 100 శాతం పనిదినాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సిబ్బందితో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 2022–23 సంవత్సరానికి అర్హులై జాబుకార్డు కలిగిన ప్రతి కుటుంబానికి తప్పకుండా వంద పనిదినాలు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకొని ఈ వారం పూర్తిచేయాలని సూచించారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

వేసవి మొదలౌతున్నందున ఏ గ్రామంలో కూడా నీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి ఏ గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తలేదన్నారు. గువ్వలకుంట్ల, ఎర్రమఠం గ్రామాలలో నీటిసమస్య ఏర్పడే అవకాశం ఉందని, అక్కడ నివారణ చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా కొత్త మోటర్లు, పైపులైన్లు వేయాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.